క్లుప్తంగా

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం


నివాళులు అర్పిస్తున్న పరామర్శిస్తున్న ఉన్నం వాసుదేవనాయుడు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని చిన్న కన్నలి ఎస్టీ కాలనీ చెందిన చింతపూడి గోపాల్ భార్య పోలమ్మ (55) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఇది తెలుసుకున్న మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఉన్నం వాసుదేవ నాయుడు మృతురాలి అంత్యక్రియలకు రూ.5వేలను అందజేశారు.

గడ్డివామి దగ్ధం


మంటలను ఆర్పుతున్న గ్రామస్తులు

ఏర్పేడు: గడ్డివామి దగ్ధమైన సంఘటన ఆదివారం మండలంలోని మేర్లపాకలో చోటుచేసుకుంది. వివరాలు..గ్రామానికి చెందిన రైతు రవి తమ ఇంటి వద్ద గడ్డివామి వేసుకున్నాడు. ఆదివారం గడ్డివామి మీదుగా పైన ఉన్న విద్యుత్ తీగల నుంచి నిప్పు రవ్వలు రాలడంతో మంటలు రేగాయి. సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి అగ్నిమాపక కార్యాలయం నుంచి ఫైరింజన్ అక్కడికి చేరుకునేసరికి గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. రూ.70 వేల ఆస్తినష్టం సంభవించినట్లు బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

గిరిజనులకు చీరల పంపిణీ


అరుదూరులో గిరిజన మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఉప సర్పంచ్ మునిరాజ

వరదయ్యపాళెం: సంక్రాంతి పురస్కరించుకుని మండలంలోని అరుదూరు గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ మునిరాజ చెన్నవారిపాళెం, అరుదూరు గిరిజనకాలనీ మహిళలకు చీరలను పంపిణీ చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా ఈ వితరణ చేశారు. కార్యక్రమంలో వరదయ్యపాళెం మాజీ సర్పంచ్ చిన్నా, స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సుబ్బరామయ్య, వెంకటయ్య, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సాయంతోనే సంతృప్తి

పెళ్లకూరు: పండుగ రోజుల్లో పేదలకు తమవంతు సాయం చేయడంలో సంతృప్తి కలుగుతుందని కేఆర్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు వేలూరు కళ్యాణ్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదివారం గ్రామంలోని దళితకాలనీ, గిరిజన కాలనీతో పాటు పరిసర గ్రామాల్లోని వెయ్యి మందికిపైగా నిరుపేదలకు చీరలు, దుప్పట్లు, లుంగీలు, టవళ్లు, బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఐదు రోజుల పాటు గ్రామంలో జరిగే ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో గ్రామానికి విచ్చేసే భక్తులు, పేదలకు అన్నీ విధాలా సాయం చేయడం సంతృప్తిగా ఉంటుందన్నారు. ఈ క్రమంలోనే పేదలకు దుస్తులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వేలూరు మురళీకృష్ణారెడ్డి, డాక్టర్ గడ్డం సునీల్‌రెడ్డి, వేలూరు హరిబాబురెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కోడి పందెం స్థావరంపై దాడులు


సైదాపురం: కోడి పందేల రాయుళ్లను అరెస్టు చూపుతున్న ఎస్ఐ

డక్కిలి: మండలంలోని చాపలపల్లె సమీపంలో కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం డక్కిలి ఎస్ఐ నాగరాజులు తన సిబ్బందితో కలిసి, దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి మూడు కోడి పుంజులు, రూ.1700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను వెంకటగిరి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

మర్లపూడిలో..

సైదాపురం: మండలంలోని మర్లపూడి శివారులో ఆదివారం కోడి పందేల స్థావరాలపై ఎస్ఐ ఉమాశంకర్ ఆధ్వర్యంలో దాడులు చేశారు.ఈ సందర్భంగా నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.2140 నగదుతోపాటు రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటింటా సంక్రాంతి



ఇరుగుళంలో అంకాలమ్మ ఆలయం వద్ద గొబ్బితడుతున్న మహిళలు, సత్యవేడు: కనుమ పండుగకు ముస్తాబు చేసిన పశువులతో యువకులు



సత్యవేడు: ఇరుగుళంలో స్నేహితుల ఆత్మీయ సమావేశం, బుచ్చినాయుడుకండ్రిగలో ముగ్గులు వేస్తున్న మహిళలు

సత్యవేడు: సత్యవేడు మండలంలో మూడురోజుల సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. అందరూ సంప్రదాయ వస్త్రధారణలతో సందడి చేశారు. ఇళ్ల వాకిలి ముంగిట వేసిన రంగవల్లులు, పెట్టిన గొబ్బెమ్మలు సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టాయి. మండలంలోని ఇరుగుళం అంకాలమ్మ ఆలయం సంక్రాంతి వేడుకలకు వేదికైంది. సామూహిక గొబ్బెమ్మ పూజలు ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. పిల్లలు, పెద్దలు కేరింతలు కొట్టారు. స్కూటర్ పోటీలు ఆకట్టుకొన్నాయి. మిత్రుల ఆత్మీ సమ్మేళనాలు, ఆటపోటీలతో యువతులు సందడి చేశారు. పశువులను చెరువు వద్ద శుభ్రంగా కడిగి, ఇళ్ల వద్ద రంగులు అద్ది, సినీనటుల చిత్రపటాలు కట్టి, పూజలు చేశారు. పశువుల పండుగ ఘనంగా నిర్వహించారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలవ్యాప్తంగా సంక్రాంతి, కనుమ పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం తమ పెద్దలకు కొత్తబట్టలు పెట్టి మొక్కులు చెల్లించారు. సోమవారం కనుమ పండుగ పురస్కరించుకుని పశువులకు, గొబ్బెమ్మకు పూజలు చేశారు. వెస్టువరత్తూరులో జాతీయ టూరిజం మాజీ డైరెక్టర్ సురేంద్రకుమార్‌రెడ్డి మహిళలతో కలసి గొబ్బిళ్లు తట్టి సందడి చేశారు. పలు గ్రామాల్లో గిరిజనులు వివిధ రకాల వేషాలతో బ్యాండ్ మేళం వాయిస్తూ సందడి చేశారు. ఇక, బుచ్చినాయుడుకండ్రిగలోని బీసీ కాలనీలోని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలవ్యాప్తంగా ప్రజలు సంక్రాంతి, కనుమ పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం సంక్రాంతి సూర్యభగవానునికి పూజలు నిర్వహించారు. తమ కుటుంబాల్లో మృతి చెందిన పెద్దలకు తర్పణం వదిలారు. సోమవారం వేడుకగా పశువుల పండుగ నిర్వహించారు.




వరదయ్యపాళెం : శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి, గ్రామోత్సవంలో ఉత్సవమూర్తులు, వరదయ్యపాళెంలో గొబ్బిళ్లు తట్టుతున్న మహిళలు

భక్తిప్రపత్తులతో పార్వేటి ఉత్సవం

వరదయ్యపాళెం: మండల వ్యాప్తంగా ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. దేవుళ్లను ఆహ్వానించి, పితృ దేవతలకు కొత్త బట్టలు పెట్టి, తర్పణాలు వదిలి, మొక్కులు చెల్లించారు. ఇక, సోమవారం పశువుల పండుగను కోలాహలంగా నిర్వహించారు. కళత్తూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్వేటి ఉత్సవం, ఆ తర్వాత గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు మోహనాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్ సుప్రజ దంపతులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు


ముగ్గుల పోటీల విజేతలతో ఎంపీపీ ఉన్నం నిర్మల, వాసుదేవనాయుడు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): సంక్రాంతి సందర్భంగా సోమవారం మండలంలోని పొయ్యి గ్రామంలో ఎంపీపీ ఉన్నం నిర్మల నేతృత్వంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. 23 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులు వేశారు. వరుసగా ఏ.గౌరి, వి.హరిత, జి.మౌనిక ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వారికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పులి రాధయ్య, తీగల వెంకటయ్య, విజయ్ కుమార్, తులసి దాస్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ ఉత్సవానికి ఏర్పాట్లు

నారాయణవనం: సంక్రాంతి సందర్భంగా మంగళవారం మండలంలోని పాలమంగళం నార్త్ పాలీశ్వరస్వామి, తుంబూరు తుంబీశ్వరస్వామి ఉత్సవ మూర్తులతో గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు సాయిరవి, లక్ష్మయ్య తెలిపారు. అగస్తీశ్వరస్వామి ఆలయం బాలాలయంలో ఉన్న కారణంతో టీటీడీ అనుబంధ శైవక్షేత్రాల ఉత్సవ మూర్తులు గిరిప్రదక్షిణ ఉత్సవంలో పాల్గొనవని ఆలయాల అధికారి నాగరాజు తెలిపారు. సంక్రాంతికి మూడవ రోజున టీటీడీ ఆలయాలైన చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి(నారాయణవనం), మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర(సముదాయం)తో పాటు తుంబూరు తుంబీశ్వరస్వామి, పాలమంగళం ఉత్తరపు కండ్రిగ పాలీశ్వరస్వామి ఉత్సవ మూర్తులతో పాటు మరో 20 గ్రామాల్లోని ఆలయాల ఉత్సవరులకు నగరిలో నిర్వహించే సంధి కార్యక్రమంలో గిరిప్రదక్షిణ ఉత్సవంగా నిర్వహించడం పరిపాటి. సముదాయంలోని అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో మరమ్మతుల కారణంతో ఉత్సవాన్ని రద్దు చేసినట్లు నాగరాజు తెలిపారు. అయితే సాంప్రదాయానికి స్వస్తి పలకరాదనే ఉద్దేశంతో తుంబీశ్వరస్వామిని శనివారం గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు గ్రామ ఉత్సవ కమిటీ పేర్కొంది.

నేత్రపర్వం.. గోదాదేవి కల్యాణం


సంక్రాంతి ఉత్సవంలో కల్యాణ వెంకటేశ్వరస్వామి

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో సోమవారం సాయంత్రం గోదాదేవి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. తొలుత ఉదయం సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి నిత్యపూజా కైంకర్యాలను పూర్తి చేశారు. ఆండాళ్ నీరాట్టు ఉత్సవాల ముగింపు పురస్కరించుకుని సాయంత్రం గోదాదేవి తిరుచ్చి వాహనంపై ఆలయ మాడ వీధుల్లో హారతులను అందుకుంటూ మహద్వారం వద్దకు చేరుకున్నారు. ఆలయం నుంచి వేంచేపుగా వచ్చిన కల్యాణ వెంకన్నకు, ఆండాళ్ అమ్మవారితో ఆలయ అర్చకులు మూడుసారు మాలలను మార్చి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం గోదావేవి సమేత కల్యాణ వెంకన్న ఆలయంలోకి ఆస్థానంలో పాల్గొన్నారు. స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ విజయకుమార్ పర్యవేక్షించారు.

ఘనంగా సంక్రాంతి ఉత్సవం

ఆదివారం సంక్రాంతి ఉత్సవాన్ని వెంకన్న ఆలయంలో ఘనంగా నిర్వహించారు. స్వామికి నిత్య పూజా కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్నకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు, నాయకులతో కలిసి మూలవర్లకు నిర్వహించిన ప్రత్యేక అర్చనల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం 6 గంటలకు తిరుచ్చి వాహనంపై నాంచారులతో స్వామి ఆలయ అంతర ప్రాకారంలో విహరించారు. అలాగే స్థానిక వీర రాఘవస్వామి ఆలయంలో ఉదయం సామూహిక గీతా పారాయణం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఓడూరుకు ఫోన్‌లో సీఎం పరామర్శ

నాయుడుపేట: మున్సిపాలిటీలోని రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధర్‌రెడ్డిని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఓడూరు సుందరరామిరెడ్డి మరణించిన సమాచారం తెలిసిన సీఎం ఆయన కుమారుడిని ఓదార్చారు. సుందరరామిరెడ్డి ఆరోగ్య పరిస్థితి ఏమిటి, ఎలా మరణించారన్న విషయాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే నేరుగా కలుద్దామని చెప్పారు.

నేదురమల్లి పరామర్శ

వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నాయుడుపేటలోని ఓడూరు గిరిధర్‌రెడ్డిని ఆయన నివాసానికి వెళ్లి, పరామర్శించారు. ఓడూరు సుందరరామిరెడ్డి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులైన ఓడూరు ముద్దుకృష్ణారెడ్డి, సోదరుడు మురళీధర్‌రెడ్డిని పరామర్శించారు. పార్టీకి సుందరరామిరెడ్డి సేవలు మరువలేనివని తెలిపారు. నేదురమల్లి వెంట నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, తోట గణేష్‌రెడ్డి, షేక్ యస్దానీబాషా, వైఎస్సార్ సీపీ నెల్లూరు-1 ఇన్‌చార్జి ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు కట్టా సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ, కట్టా కమలాకర్‌రెడ్డి ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

రేణిగుంట: జాతీయ యువజన వారోత్సవాల్లో భాగంగా సోమవారం రేణిగుంట సీఆర్ఎస్ సమీపంలోని శబరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియస్‌రాజు, ముఖ్య సలహాదారు అమ్ములురాజు అన్నదానం చేశారు. వృద్ధులతో కలసి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఏర్పేడు: మండలంలోని కోబాక ఎస్టీ కాలనీలో ఓ మహిళ తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి సోమవారం రాత్రి తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు..కోబాక ఎస్టీ కాలనీకి చెందిన అంకయ్య కుమార్తె చెల్లెమ్మ(39) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. నొప్పి భరించలేక ఈ నెల 14న గుళికలు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గుర్తించిన కుటుంబ సభ్యులు 108లో ఆమెను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు డాక్టర్లు రెఫర్ చేశారు. రుయాలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి సుధీర్‌రెడ్డికి లేదు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించే స్థాయి బొజ్జల సుధీర్‌రెడ్డికి లేదని, అతను తనస్థాయి ఎంటో ముందు తెలుసుకోవాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బొజ్జల సుధీర్‌రెడ్డి తండ్రి గోపాలకృష్ణారెడ్డి 30 సంవత్సరాలు ఎమ్మెల్యేగా కొనసాగారన్నారు. వారు పేదలకు సేవచేసి ఉంటే నేడు నియోజకవర్గంలో ఇంతమంది పేదలుండేవారే కాదని తెలిపారు. ఎన్నికల సమయానికి రావడం ప్రజలను మోసం చేయడం.. తిరిగి హైదరాబాద్‌కు వెళ్లిపోయి వ్యాపారాలు చేసుకుని వేలకోట్లు సంపాదించడం సుధీర్‌రెడ్డి కుటుంబం దినచర్య అని అన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేదప్రజలకు ఎంతో సేవ చేస్తున్నారన్నారు. శబరిమలైకి వెళ్లలేని పేద అయ్యప్ప భక్తుల కోసం పెద్దిరెడ్డి సొంతంగా అయ్యప్ప ఆలయాన్ని నిర్మించారన్నారు. 14సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పం తన సొంత నియోజకవర్గం కాకపోయినా అభివృద్ధి మార్గంలో నడిపిస్తున్నారన్నారు. ఎర్రచందనంతో వెంకటేశ్వరస్వామి ఆస్తులు కాజేసిన బొజ్జల సుధీర్‌రెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సుధీర్‌రెడ్డి వీరప్పన్ వారసుడని శ్రీకాళహస్తిలో ఎవరిని అడిగినా చెబుతారన్నారు. వేంకటేశ్వర స్వామి తల్లి వకులామాత ఆలయం నిర్మించిన ఘనత పెద్దిరెడ్డికే దక్కుతుందని చెప్పారు. ఇసుక మాఫియాలో సుధీర్‌రెడ్డికి మించిన వారు లేరన్నారు. 2016లో ఏర్పేడు మునగలపాళెం గ్రామస్తులు 16మందిని కడుపున పెట్టుకున్న విషయాన్ని సుధీర్‌రెడ్డి మరిచిపోయారా? అని ప్రశ్నించారు. అన్ని కుటుంబాల ఉసురు పోసుకున్న వారిని దేవుడు తప్పకుండా శిక్షిస్తారని అన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి టిడ్కో ఇళ్లు పూర్తికాకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. నేడు నియోజకవర్గంలో పేదలకు 25వేల ఇంటిస్థలాలు మంజూరు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సుధీర్ రెడ్డి చేసే పనులను ఆధారాలతో సహా మీడియా ముందు ఉంచుతానని బియ్యపు మధుసూదన్‌రెడ్డి చెప్పారు.

బోరు మోటారు స్టార్టర్, కేబుల్ స్వాధీనం

- ఇద్దరు దొంగల అరెస్ట్


అరెస్ట్ చేసిన నిందితులతో సీఐ విక్రమ్, ఎస్ఐ మంజునాథరెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: బోరు మోటారు స్టార్లరు, కేబుల్ స్వాధీనం చేసుకుని ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసినట్లు సీఐ విక్రమ్, ఎస్ఐ మంజునాథరెడ్డి సోమవారం తెలిపారు. వివరాలు..కొత్తకండ్రిగ దళితవాడకు చెందిన బొర్రామణి, కారణి గంగయ్య ద్విచక్ర వాహనంపై గోనె సంచిలో మోటారు స్టార్టరు, వైరు పెట్టుకుని వెళుతుండగా లక్ష్మీపురం వద్ద అనుమానించి పోలీసులు వారిని విచారణ చేసేసరికి చోరీ బాగోతం బైటపడింది. తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల్లో వీటిని చోరీ చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు మధుబాబు, గణపతి, నాగరాజు, కానిస్టేబుళ్లు రమేష్, ప్రభాకర్, సురేష్, నమోరంగ, రేగన్, అరుణ్, గంగాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనుమ పార్వేటి ఉత్సవం


నాగలాపురంలో కనుమ పార్వేటి ఉత్సవంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేదనారాయణ స్వామి

పిచ్చాటూరు: కనుమ పర్వదినం పురస్కరించుకుని సోమవారం నాగలాపురం శ్రీ వేదనారాయణస్వామి సన్నిధిలో పార్వేటి ఉత్సవం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేదనారాయణస్వామిని ప్రత్యేకగా అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. అంతకు ముందు రోజు ఆదివారం మకర సంక్రాంతి పురస్కరించుకుని సతుల సమేత మత్స్యావతార మూర్తి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజ భట్టాచార్య శ్రీ దేవి, భూదేవి సమేత వేదనారాయణస్వామిని ప్రత్యేకంగా అభిషేకించి సుందరంగా అలంకరించారు. దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. అలాగే, సంక్రాంతి, కనుమ పండుగలను పిచ్చాటూరు, నాగలాపురం మండలాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.

గోశాలలో వేడుకగా గోపూజ


సురుటుపల్లె శ్రీ పళ్లికొండేశ్వరాలయ గోశాలలో గోవులకు హారతి ఇస్తున్న భక్తులు

పిచ్చాటూరు: కనుమ పర్వదినం పురస్కరించుకుని సోమవారం నాగలాపురం మండలం సురుటుపల్లెలోని శ్రీ పళ్లికొండేశ్వరాలయ గోశాలలో గోపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గోశాలను పుష్పాలతో అందంగా అలంకరించారు. గోవులకు రంగులు వేసి, ముస్తాబు చేశారు. అనంతరం కనుమ పొంగలి పొంగించి వైభవంగా గోపూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఎదురుసేవ సంబరం


ఎదురుసేవ మండపం


స్వామి అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు


ఊరేగింపులో స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరునికి సోమవారం సాయంత్రం ఎదురుసేవ కార్యక్రమం సంబరంగా సాగింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదిదంపతుల కల్యాణానికి దేవతా గణాలు, మునులను ఆహ్వానించేందుకు స్వామి అమ్మవార్లు గిరిప్రదక్షిణకు వెళ్లారు. గిరిప్రదక్షిణ ముగించుకుని వచ్చిన స్వామి అమ్మవార్లకు పట్టణ శివారులోని శుకబ్రహ్మాశ్రమం సమీపంలో ఎదురు సేవ మండపం వద్ద భక్తులు ఘన స్వాగతం పలికారు. స్వామి అమ్మవారుల కొద్దిసేపు ఎదురుసేవ మండపంలో సేద తీరారు. అనంతరం స్వామి అమ్మవార్లు ఆలయానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా గిరిప్రదక్షిణ సందర్భంగా సాధారణంగా అంజూరు మండపం వద్ద వంటలు వండి శ్రీపాదకూలీలు, భక్తులకు వడ్డిస్తారు. అయితే ఈసారి ఆలయం నుంచి వండి తీసుకురావడంతో ఆలస్యమైంది. దీంతో శ్రీపాదకూలీలు, భక్తులు నిరీక్షించాల్సి వచ్చింది. ఇక గిరిప్రదక్షిణకు ఏర్పాటైన కొత్తమార్గం కొద్దిగా ఎగుడు దిగుడుగా ఉండడంతో స్వామి అమ్మవార్లను మోసే వారు కాస్త ఇబ్బంది పడ్డారు.